సాక్షి
నంద్యాల
మంగళవారం । 17 । జనవరి । 2023



ఆధ్యాత్మిక వెలుగులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో సోమవారం ప్రారంభమైన శ్రీశైల వైభవంపై లైట్ అండ్ సౌండ్ షో ఆకట్టుకుంటోంది.



ఆది పరాశక్తి అమ్మవారు భ్రమరాంబాదేవిగా ఆవిష్కరించిన దృశ్యం



కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఈఓ ఎస్. లవన్న, భక్తులు

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

నంద్యాల(సిటీ): ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అండర్–19 బాల, బాలికలకు ఫెన్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సీఈఓ ఎంవీ రమణ, కర్నూలు జిల్లా ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పద్మావతి తెలిపారు. సోమ వారం వారు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని పద్మావతి నగర్‌లోని జిల్లా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణంలో నిర్వహించే ఈపోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 150 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. డాక్టర్ అంకాళ్‌రెడ్డి మెమోరియల్ కళాశాలలో చైర్మన్ రామలింగారెడ్డి క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తారన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలుగాప్రోత్సాహం అందజేస్తుందన్నారు.

త్వరలో వైఎస్‌ఆర్ పశు బీమా

కర్నూలు(అగ్రికల్చర్): పశువులు, జీవాలు ప్రమాదవశాత్తూ లేదా వ్యాధుల కారణంగా మరణిస్తే రైతులకు ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం వైఎస్ఆర్ పశు బీమా పథకం (లైవ్‌స్టాక్ ఇన్సూరెన్స్ స్కీమ్) అమలుకు శ్రీకారం చుట్టింది. ఇదివరకు అమలులోని వైఎస్ఆర్ పశునష్ట పరిహార పథకం స్థానంలో ఈ బీమాను అమలు చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఈనెల 12న మార్గదర్శకాలతో కూడిన జీఓ 3 జారీ చేసింది. అయితే బీమా పథకం అమలుకు పశుసంవర్థక శాఖ కంపెనీలతో ఎంఓయూ కుదుర్చుకోవాల్సి ఉంది. జాతీ పశువులు మరణిస్తే రూ.30వేలు, నాటు పశువులు మరణిస్తే రూ.15 వేలు, సన్న జీవాలు(గొర్రెలు, మేకలు, పందులు) మరణిస్తే రూ.6వేల వరకు పరిహారం లభిస్తుంది. ఒక రైతుకు గరిష్టంగా 5 ఆవులు లేదా గేదెలకు, సన్న జీవాలు 50 వరకు బీమా వర్తిస్తుంది.

పారదర్శకంగా కౌన్సెలింగ్

కర్నూలు సిటీ: జిల్లాలో చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ, పదోన్నతులకు కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహించనున్నట్లు డీఈఓ డా.వి రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంత వరకు మండల, డివిజన్ స్థాయిలో జరిగిన ప్రక్రియను నిలిపివేశామన్నారు. సర్‌ప్లస్, కన్వర్షన్ ప్రక్రియ మంగళవారం ఉదయం 10 గంటలకు ఏ క్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్–2022లో జరిగిన పదోన్నతులకు విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని, 30 శాతం డైరెక్ట్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి బుధవారం కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఇందుకు అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సహకరించాలని డీఈఓ కోరారు.

ఉపాధి కూలీలకు పీఎం సురక్ష బీమా యోజన

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి కూలీలకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై) వర్తింపజేస్తున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉపాధి కూలీలు దాదాపు 3.50 లక్షల మంది ఉన్నారని, ప్రతి ఒక్కరినీ బీమా పరిధిలోకి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. ఏటా కేవలం రూ.20తో బీమా వర్తిస్తుందని, ఈ మొత్తాన్ని కూడా ఆటోమేటిక్ కటింగ్‌గా పెట్టుకోవచ్చన్నారు. ఉపాధి కూలీలు ప్రమాదవశాత్తూ మరణిస్తే వారసులకు రూ.2 లక్షల పరిహారం లభిస్తుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత అంగ వైకల్యం కలిగినా రూ.2 లక్షల వరకు పరిహారం.. పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ.లక్ష పరిహారం వస్తుందని పేర్కొన్నారు.

ఘనంగా రామిరెడ్డి తాత ఆరాధనోత్సవాలు

కల్లూరు: అవధూత రామిరెడ్డి తాత సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరులో సేవ సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధన మహోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా తాత విగ్రహానికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించి సమాధిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి వారి చిత్రపటాన్ని పల్లకీపై ఉంచి భజనలు చేస్తూ, కోలాటాలు, నృత్యాలు మధ్య కల్లూరు పురవీధుల గుండా ఊరేగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్లూరులో జన్మించిన దత్తాంశ సంభూతుడైన రామిరెడ్డి తాత ఈ ప్రాంతాన్ని పావనం చేశాడన్నారు. మధ్యాహ్నం భక్తులందరికీ సేవా సంస్థాన్ సభ్యులు అన్నదానం చేశారు. కార్పొరేటర్లు మైతాపు నరసింహులు, సాన శ్రీనివాసులు, దండు లక్ష్మీకాంతరెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, సంస్థాన్ కోశాధికారి హనుమంతురెడ్డి, పీఠాధిపతులు సుబ్రహ్మణ్యం, ఎల్లప్ప స్వామి తదితరులు పాల్గొన్నారు.



స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవంలో మాంగళ్యధారణ కార్యక్రమ దృశ్యం



కైలాస వాహన సేవలో ఆదిదంపతులు

కల్యాణ వైభోగం

- కైలాస వాహనంపై ఊరేగిన ఆదిదంపతులు
- నూతన వస్త్రాలు, అడవి ఆకులతో ఆభరణాలు సమర్పించిన చెంచులు
- నేడు సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు యాగపూర్ణాహుతి
- వేదపండితులతో వేదగోష్టి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆదివారం నిర్వహించిన పార్వతీ, పరమేశ్వరుల లీలా కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. నాగులకట్ట వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై నిర్వహించిన ఈ కార్యక్రమానికి నల్లమల చెంచులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠించారు. ఆది దంపతులై, జగత్తుకంతా తల్లిదండ్రులైన స్వామి అమ్మవార్ల లీలా కల్యాణం ద్వారా విశ్వశాంతి, లోక శ్రేయస్సుతో పాటు జనులందరికీ సకల శుభాలు కలగాలని సంకల్పంలో పేర్కొన్నారు. అలాగే మహాగణపతిపూజ, పుణ్యాహవచనం, స్వామిఅమ్మవార్లు ఆశీనులైన సింహాసనానికి పూజాదికాలు జరిపారు. కల్యాణోత్సవంలో భాగంగా కంకణాలకు పూజాదికాలు చేసి కంకణధారణ జరిపారు. స్వామి వారికి యజ్ఞోపవీతధారణ చేశారు. అనంతరం కల్యావరణం, అమ్మవారికి కంకణధారణ చేశారు. అలాగే స్వామిఅమ్మవార్ల ప్రవర, నూతన వస్త్ర సమర్పణ, భాసికధారణ, స్వామి అమ్మవార్లకు జీలకర, బెల్లం సమర్పించారు. తర్వాత అమ్మవారికి మాంగళ్యధారణ, తలంబ్రాల కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం సాయంత్రం స్వామిఅమ్మవార్లకు నందివాహనసేవ, గ్రామోత్సవం నిర్వహించారు.

కైలాసవాసా.. పాహిమాం

సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం స్వామిఅమ్మవార్లకు కైలాసవాహనసేవ నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాల మధ్య తీసుకొచ్చారు. అలంకారమండపంలోని కైలాసవాహనంపై ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం కైలాసవాహనంపై ఆశీనులైన స్వామి అమ్మవార్లకు ఆలయ ఉత్సవం నిర్వహించి వెలుపలకు తీసుకొచ్చారు. గంగాధర మండపం వద్ద ఈఓ, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి గంగాధర మండపం నుంచి నంది మండపం, అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అశేష భక్తజనం, డప్పు వాయిద్యాలు, కోలాటలు, కళాకారుల విచిత్ర వేషధారణ, విన్యాసాలు, నృత్యాల మధ్య ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.

వెలకట్టలేని ఆభరణాలు

శ్రీశైల మహాక్షేత్రంతో గాఢమైన సంబంధం గల నల్లమల పరిధిలోని చెంచులకు సంక్రాంతి బ్రహ్మోత్సవ కల్యాణానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. దేవస్థానం తరపున పురుషులకు పంచ, కండువా, మహిళలకు చీర, రవిక అందజేశారు. కల్యాణోత్సవంలో చెంచులు నూతన వస్త్రాలతో పాటు అడవి ఆకులతో అల్లిన ఆభరణాలు స్వామి అమ్మవార్లకు సమర్పించారు. ఆలయ రాజగోపురం వద్ద వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి దంపతులు, పలువురు చెంచులు నూతన వస్త్రాలను, ఆభరణాలను తలపై పెట్టి స్వామి అమ్మవార్లకు సమర్పించారు. కల్యాణ సమయంలో వాటిని స్వామిఅమ్మవార్లకు అలంకరించారు. ఈ వేడుకలో శ్రీశైల దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, ఏఈఓ హరిదాసు, పీఆర్వో టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గోపూజ మహోత్సవం

కనుమ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేకంగా గోపూజ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగాణంలోని శ్రీగోకులంలో, దేవస్థాన గోసంరక్షణశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు, వేదపండితులు పూజా సంకల్పాన్ని పఠించారు.

మల్లన్న సేవలో దేవదాయశాఖ మంత్రి


శ్రీశైలేశుడిని సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అంతకు ముందు వారికి దేవస్థానం ఈఓ లవన్న, అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

నేడు యాగపూర్ణాహుతి

సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు మంగళవారం యాగపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తారు. స్వామివారి యాగశాలలో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం చేపడుతారు. అలాగే అమ్మవారి ఆలయ ప్రాంగాణంలో చతుర్వేద పారాయణలు జరిపిస్తారు. అదే రోజు సాయంత్రం వేదపండితులతో వేదసభ నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.



చెంచు మహిళలకు స్వామివారి శేషవస్త్రాలు అందిస్తున్న ఈఓ, ఐటీడీఏ పీఓ



నందివాహనంపై స్వామిఅమ్మవార్లు



గోవులకు నూతన వస్త్రాలు సమర్పించి పూజలు చేస్తున్న ఈఓ

దేవదేవుడు వెడలె..



అశేష భక్తజనం మధ్య దేవదేవుడి ఉత్సవ పల్లకీ

- వైభవంగా అహోబిలేశుడి పార్వేట మహోత్సవానికి శ్రీకారం
- మార్మోగిన గోవింద నామస్మరణ
- సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఉత్సవ పల్లకీని సాగనంపిన చెంచులు

ఆళ్లగడ్డ: కులమతాలకు అతీతంగా సకుటుంబ సపరివారసమేతంగా తన పెళ్లి వేడుకలకు రావాలని ఆహ్వానించేందుకు సోమవారం అహోబిలేశుడు కొండ దిగి భక్తుల చెంతకు బయలుదేరాడు. సంక్రాంతి పండుగా ముగిసిన మరుసటి రోజు (కనుమ) పార్వేట ఉత్సవాలు ప్రారంభించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఎగువ అహోబిలంలో వెలసిన జ్వాలా నరసింహ స్వామిని ఆదివారం దిగువ అహోబిలం తీసుకొచ్చి ప్రహ్లాదవరదస్వామితో కలిపి ప్రత్యేకంగా అలంకరించిన యాగశాలలో కొలువుంచారు. ఇరువురికి తలపాగా చుట్టి వేటగాళ్లలా ప్రత్యేకాలంకరణ గావించారు. తర్వాత పార్వేట జరగనున్న 46 రోజులు స్వామి వెంట నడిచే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంప్రదాయబద్ధంగా..

వేదపండితుల వేద మంత్రోచ్చారణాలు, చెంచుల సంప్రదాయ నృత్యాల నడుమ ప్రహ్లాదవరదుడు, జ్వాలా నరసింహ స్వాముల సమక్షంలో సోమవారం కుంభహారతి నిర్వహించారు. తర్వాత అన్నకూటోత్సవం (46 రోజులు స్వామికి అవసరమైన ఆహారం) అర్పించారు. ఇందులో కొంత భాగాన్ని చెంచులు, గుడికట్టు, తప్పెట, అటవీ అధికారులు, బోయిలూ, రెడ్డి, కరణం, అర్చకులు, నిషాని తదితరులకు అందజేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవపల్లకీలో ఉత్సవ మూర్తులను కొలువుంచారు. భక్తుల గోవింద నామస్మరణతో ఉత్సవ పల్లకీ ఆలయం వెలుపలకు వస్తుండగా పల్లకీపై విల్లంభులు ఎక్కుపెట్టి చెంచులు సంధించారు. అనంతరం చెంచులు సంప్రదాయ నృత్యాలు చేస్తూ పల్లకీని గ్రామ పొలిమేరవరకు సాగనంపారు. ఈ కార్యక్రమాలను ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సౌమ్యా నారాయన్‌లు దగ్గరుండి పర్యవేక్షించారు. ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐలు రాజశేకర్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, గంగనాథబాబు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పార్వేట పల్లకీలో కొలువైన శ్రీజ్వాలనరసింహుడు, శ్రీప్రహ్లాదవరదుడు

కరువు సీమను సస్యశ్యామలం చేస్తాం

డోన్: కరువు సీమను కృష్ణా జలాలతో సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినమైన ఆదివారం, సోమవారం రెండురోజుల పాటు మంత్రి బుగ్గన నియోజకవర్గంలోని ప్యాపిలి, డోన్ మండలాల పరిధిలోని 12 చెరువులను సందర్శించి హంద్రీనీవా కాల్వ నీటితో చెరువులను నింపే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రెడ్డి రాజశేఖర్, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు ఆధ్వర్యంలో చనుగొండ్ల గ్రామంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సందర్భంగా హంద్రీనీవా నీటితో డోన్, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లోని 68 చెరువులను నింపుతామని హామీ ఇచ్చారని, ఆ మేరకు మొదటి దశ కింద రూ.360కోట్లతో వచ్చే జూన్ నాటికి సాగునీరు అందిస్తామన్నారు. క్రిష్ణగిరి మండలం పులిచెర్ల కొండపై డెలివరీ చాంబర్‌తో పాటు లక్కసాగరం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్.. అన్ని చెరువులకు నీటిని మళ్లింపు చేసే కార్యక్రమం పైపులైన్ పనులు 100 శాతం పూర్తయ్యాయన్నారు. ముఖ్యమంత్రి పర్యటన తేదీ ఖరారు కాగానే చెరువులకు నీటిని మళ్లించే కార్యక్రమాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఆయన మండలంలోని దేవరబండ, చనుగొండ్ల, యాపదిన్నె, మల్లెంపల్లె, వెంకటాపురం, ఉడుములపాడు, జగదుర్తి, ఎల్లారెడ్డి చెరువుల వద్ద ఆయా గ్రామ ప్రజలతో కలిసి మంత్రి బుగ్గన నీటి మళ్లింపు కార్యక్రమానికి భూమిపూజ చేశారు.

వచ్చే ఖరీఫ్ నాటికి 10వేల ఎకరాలకు సాగునీరు

ప్యాపిలి: వచ్చే ఖరీఫ్ నాటికి డోన్ నియోజకవర్గంలో 10వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మెట్టుపల్లి, ఏనుగుమర్రి, ప్యాపిలి, పెద్దపాదిళ్ల చెరువులను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి రైతులనుద్దేశించి మాట్లాడారు. డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లోని 68 చెరువులకు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా నీటిని నింపే పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. పనులు పూర్తయిన వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. వర్షాధారం మీద మాత్రమే ఆధారపడిన డోన్ నియోజకర్గం రైతులకు చెరువులు నింపే కార్యక్రమం ఓ వరం అన్నారు. తద్వారా ప్రత్యక్షంగా 10 వేల ఎకరాలకు, పరోక్షంగా మరికొన్ని వేల ఎకరాలకు సాగనీరు అందుతుందన్నారు. బోర్లలో భూగర్భ జలాలు పెరగడంతో పాటు ఏడాదికి రెండు నుంచి మూడు పంటలు తీసే అవకాశం లభిస్తుందన్నారు. అలాగే రూ.300 కోట్లతో చేపడుతున్న వాటర్ గ్రిడ్ ద్వారా డోన్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నామని తెలిపారు. పనులు పూర్తి కాగానే ఇంటింటికీ శుద్ధిచేసిన తాగునీరు అందిస్తామన్నారు. ప్యాపిలిలో రూ.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఎంపీపీ గోకుల్‌లక్ష్మి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఎలక్ట్రికల్ సీఈఓ చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.



మెట్టుపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



యాపదిన్నె చెరువుకు హారతిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

చురుగ్గా రబీ ఈ–క్రాప్ నమోదు

కర్నూలు(అగ్రికల్చర్): రబీ పంటల ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. కర్నూలు జిల్లాలో 92శాతం, నంద్యాల జిల్లాలో 74 శాతం పూర్తయింది. కర్నూలు జిల్లాలో రబీ సాధారణ సాగు 3,18,126 ఎకరాలు ఉండగా.. 1,86,415 ఎకరాల్లో పంటలు సాగయ్యా యి. నంద్యాల జిల్లా రబీ సాధారణ సాగు 4,58,151 ఎకరాలు ఉండగా.. 2,71,488 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇప్పటి వరకు 61,512 మంది రైతులు సాగు చేసిన 2,02,087 ఎకరాల్లోని పంటలను నమోదు చేశారు. వీఏఏ, వీఆర్‌వోల బయోమెట్రిక్‌తో పాటు రైతులతో స్వయంగా ఈ–కేవైసీ చేయిస్తున్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

పాణ్యం: గవర్నర్ పర్యటన ఏర్పాటు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పీఆర్ ఎస్ఈ రామ్మోహన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన డీఈ గంగధార్, ఏఈ మహబూబ్‌బాషా, ఐటీడీఏ ఇంజినీరు విజయకుమార్‌తో కలిసి నెరవాడ మెట్ట నుంచి గిరిజన గురుకుల బాలికల పాఠశాల వరకు వేస్తున్న బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ రహదారి పనులు వేగవంతంచేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దస్తగిరి, ఈఓఆర్డీ భాస్కరరావు, వీటీడీఏ ప్రెసిడెంట్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న పీఆర్ఎస్ఈ రామ్మోహన్

ఊరూరా.. సంక్రాంతులు


దొర్నిపాడు మండలం రామచంద్రాపురంలో తెప్పోత్సవ దృశ్యం


ఆస్పరి మండలం కైరుప్పలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


మామిదాలపాడులో గోదా రంగ నాథ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

పల్లె గూటిలో సంక్రాంతి పండుగ కాంతులు విరజిమ్మాయి. నేలపై వాలిన హరివిల్లులా ముగ్గులు మెరిశాయి. ఇంటింటా సంతోషాలు విరబూశాయి. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కర్నూలు, నంద్యాల జిల్లా ప్రజలు పండుగను ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మహిళలు, క్రీడా పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్వేట ఉత్సవాలు వేడుకగా సాగాయి. - సాక్షి నెట్‌వర్క్


నంద్యాలలో రథోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వేషధారణ


సి.బెళగల్ మండలం తిమ్మందొడ్డిలో తుంగభద్ర నది తీరంలో భక్తుల కోలాహలం


నంద్యాలలో రథోత్సవం ఎదుట కోలాటం


పగిద్యాల మండలం పడమర ప్రాతకోటలో పొట్టేలు పందెం పోటీలు

దూసుకొచ్చిన మృత్యువు

- దొరపల్లి గ్రామం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- వెనుక నుంచి ఐచర్ వాహనం ఢీకొని ముగ్గురు మృతి


ప్రమాదానికి కారణమైన ఐచర్ వాహనం




మృతులు సందీష్, ఎల్లకృష్ణ, రామకృష్ణ (ఫైల్)

డోన్ రూరల్: మండల పరిధిలోని దొరపల్లి గ్రామం వద్ద 44వ జాతీయరహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వెనుక నుంచి ఐచర్ వాహనం దూసుకొచ్చి ముగ్గురి ప్రాణాలు తీసింది. బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపిన ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దొరపల్లి గ్రామానికి చెందిన బొందిమడుగుల రామకృష్ణ(44), ఎల్లకృష్ణ (34) గౌండ పని చేస్తారు. వీరు డోన్ పట్టణంలోని ఓ ఆసుపత్రిలో ఆరోగ్యం బాగా లేక చికిత్స పొందుతున్న బంధువులను చూసేందుకు ఏపీ 39ఎల్ఏ 1958 నంబర్ గల ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. అలాగే డోన్ పట్టణంలోని సుజాతమ్మ నగర్ కాలనీకి చెందిన సందీష్ (32) అనే వ్యక్తి కొత్తపల్లి వద్ద ఉన్న డాబాలో భోజనం చేసి ఏపీ 21 బీడబ్ల్యూ 4942 నంబర్ గల స్కూటీపై తిరిగి వెళ్తున్నాడు. దొరపల్లి వద్ద గుత్తి నుంచి హైదరాబాద్‌కు పోతున్న ఏపీ02టీహెచ్ 0895 నంబర్ గల ఐచర్ వాహనం అతివేగంగా వచ్చి ముందు వెళ్తున్న రెండు బైక్‌లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలపై ఉన్న ముగ్గురు కూడా అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఐచర్ వాహనం సీజ్ చేసి, అనంతపురం జిల్లా బుడ్డాల గ్రామానికి చెందిన డ్రైవర్ లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ మల్లికార్జున వివరించారు. రామకృష్ణకు భార్య నాగమ్మ, ఇద్దరు కూతురులు, ఒక కొడుకు, ఎల్లకృష్ణకు భార్య మహేశ్వరి, ఒక కొడుకు ఉన్నారు. సందీష్‌కు ఇంకా వివాహం కాలేదు. కర్నూలు డీఎంహెచ్‌ఓ ఆఫీసులో ఎంఎస్‌ఓగా పనిచేస్తున్నట్లు తండ్రి శ్రీనివాసులు తెలిపారు.

రైతుపై ఎలుగుబంటి దాడి

- భయాందోళనలో ఎర్రగూడూరు గ్రామస్తులు


ఎలుగుబంటి దాడిలో గాయపడిన బుడగజంగం సాంబ

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో సోమవారం బుడగజంగాల సాంబ అనే రైతుపై ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచింది. వివరాల్లోకి వెళితే... గ్రామ శివారులోని మొక్కజొన్న పంటకు నీళ్లు పారించేందుకు భార్య జానకమ్మతో కలిసి సాంబ వెళ్లాడు. పొలంలో తిరుగుతుండగా అక్కడే ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా అతనిపై దాడి చేసింది. గమనించిన భార్యజానకమ్మ గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని బుడగ జంగం కాలనీ వాసులు పరుగెత్తుకుంటూ వచ్చారు. గమనించిన ఎలుగుబంటి అక్కడి నుంచి పారిపోయింది. అప్పటికే సాంబకు కుడి చేతి జబ్బపై తీవ్ర గాయం చేసింది. వెంటనే చికిత్స నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు. కాగా నాలుగునెలల కాలంలో ఇలాంటి ఘటనలు జరగడం రెండోసారి. ఇదివరకే బానకచెర్ల రెగ్యులేటరు సమీపంలో ఎర్రగూడూరు గ్రామానికే చెందిన మేకల కాపరి క్రిష్ణపై ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచింది. గ్రామ చుట్టుపక్కల మొక్కజొన్న పైర్లు ఏపుగా పెరిగి ఉండటంతో వాటిలో ఎలుగుబంట్లు స్థావరం ఏర్పరుచుకున్నాయో ఏమో తెలియదు. దీంతో గత కొద్ది రోజుల నుంచి పొలాల వైపు వెళ్లాలంటేనే భయమేస్తోందని, అటవీశాఖ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని రైతులు, వ్యవసాయ కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌కు గురై..


నవీన్‌కుమార్ (ఫైల్)


మృతి చెందిన చాకలి గోపెమ్మ

పాణ్యం: వడ్డుగండ్ల గ్రామానికి చెందిన యువకుడు షార్ట్‌సర్క్యూట్‌కు గురై మృతి చెందాడు. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. నంద్యాలలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుకున్న నవీన్‌కుమార్(18) ఈనెల 14వ తేదీన తండ్రి రామచంద్రుడితో కలిసి పొలానికి వెళ్లాడు. అక్కడ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన సపోర్ట్‌వైర్‌కు విద్యుత్ సరఫరా అవుతుంది. గమనించకుండా నవీన్‌కుమార్ ఆ వైర్ తగలడంతో షార్ట్‌సర్క్యూటై కుప్పకూలిపోయాడు. తండ్రి గమనించి వెంటనే శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం కోలుకోలేక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఈశ్వరయ్యగౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

గడివేములలో..

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామానికి చెందిన ఓ మహిళ విద్యుత్ షాక్‌తో ఆదివారం మృతి చెందారు. గోపెమ్మ (27) వ్యవసాయ కూలీ. ఆదివారం దుర్వేశి గ్రామంలో వరినాట్లు వేసే పనికి వెళ్లింది. పొలంలో వరినాట్లు వేస్తుండగా మోటరు వద్ద విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా మృతురాలి భర్త వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

- కానిస్టేబుల్ ఉద్యోగార్థులకు నెట్ సెంటర్ నిర్వాహకుడు మోసం
- ఒక్కొక్కరి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు రూ. 400 వసూలు
- తర్వాత నకిలీ రసీదు జారీ
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు


పట్టణ సీఐ విజయభాస్కర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

జూపాడుబంగ్లా: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులను ఓ నెట్‌సెంటర్ నిర్వాహకుడి ఫేక్ దరఖాస్తు రసీదులు ఇచ్చి మోసం చేశాడు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగు చూడటంతో బాధిత అభ్యర్థులు పోలీసులను ఆశ్రయించారు. నందికొట్కూరు పట్టణ సీఐ విజయభాస్కర్, బాధితులు తెలిపిన వివరాల మేరకు... ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో నందికొట్కూరు పట్టణానికి చెందిన సుమారు 50 మంది నిరుద్యోగులు పక్షం రోజుల క్రితం కాలేజీ రోడ్డులోని అమీర్ ఇంటర్నెట్ సెంటర్‌కు వెళ్లారు. నెట్ స్లోగా ఉంది, జిరాక్స్ కాపీలు, ఫీజు డబ్బు ఇచ్చి వెళ్తే ఆన్‌లైన్ చేస్తానని నిర్వాహకుడు సయ్యద్ అమీర్‌బాషా వారిని నమ్మించాడు. నమ్మి దరఖాస్తుదారులు జిరాక్స్ కాగితాలతో పాటు రూ.400 నగదు అతని చేతిలో పెట్టి ఇళ్లకు వెళ్లారు. తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినట్లుగా కంప్యూటర్‌లో ఫేక్ రసీదులు తయారు చేసిచ్చాడు. ఈనెల 22న కానిస్టేబుల్ ఉద్యోగాలకు పరీక్ష జరుగనుండటంతో దరఖాస్తుదారులు హాల్‌టికెట్లను డౌన్‌లోడు చేసుకునేందుకు నెట్‌సెంటర్ల వద్దకు వెళ్లారు. ఆన్‌లైన్‌లో ఎంత వెతికినా వారి హాల్‌టికెట్ కనిపించకపోవటంతో పాటు చివరికి వారు ఆన్‌లైన్ దరఖాస్తు చేయలేదని తెలిసింది. వెంటనే తమను మోసగించిన నెట్ సెంటర్ వద్దకు వెళ్లగా ఆ సెంటర్ మూసి ఉండటంతో బాధితులు లబోదిబోమంటూ నందికొట్కూరు పట్టణ పోలీసులను ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. షేక్ అబ్దుల్లా అనే యువకుడి ఫిర్యాదు మేరకు నెట్‌సెంటర్ నిర్వాహకుడిపై చీటింగ్, ఫోర్జరీ, తదితర కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ విజయభాస్కర్ తెలిపారు. కాగా సయ్యద్ అమీర్‌బాషా గతంలో పదోతరగతి ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో, తిరుమల దర్శనార్థం వెళ్లే భక్తులను ఆన్‌లైన్ దర్శనం టికెట్లు బుక్‌చేస్తానని డబ్బులు తీసుకుని మోసగించిన కేసుల్లో కూడా నిందితుడిగా ఉన్నారు.


నెట్‌సెంటర్ నిర్వాహకుడు అభ్యర్థులకు ఇచ్చిన నకిలీ ఆన్‌లైన్ రశీదులు

చిరుత కళేబరం లభ్యం



బనగానపల్లె: మండలంలోని రామతీర్థం-గోనవరం ఎస్సార్‌బీసీ తూమువద్ద కాల్వలో సోమవారం చిరుత కళేబరం లభ్యమైంది. సమాచారం అందుకున్న డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్, ఎఫ్ఆర్‌ఓ మాధవి, డీఆర్‌ఓ చంద్రహాస్, బిట్ ఆఫీసర్ మహేష్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చిరుత కళేబరాన్ని బట్టి 10 రోజుల క్రితం చనిపోయి ఉంటుందని భావిస్తూ బనగానపల్లె పశు వైద్యాధికారి డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డితో కలిసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కళేబరాన్ని కర్నూలు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు, తిరుపతి ఎస్‌వీ జూపార్క్‌కు పంపారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు డీఎఫ్‌ఓ తెలిపారు.

పాముకాటుకు ఇద్దరు మృత్యువాత


శేషిరెడ్డి(ఫైల్)

దొర్నిపాడు: కొండాపురం గ్రామానికి చెందిన చెవ్వ శేషిరెడ్డి (55) అనే రైతు పాముకాటుతో ఆదివారం మృతి చెందాడు. శనివారం జొన్న పంటకు నీళ్లు కట్టేందుకు పొలం గట్టుపై వెళ్తుండగా పామును చూసుకోకుండా తొక్కడంతో కాటేసింది. వెంటనే కుటుంబసభ్యులు గ్రామంలో ప్రథమచికిత్స చేయించి నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. వారం క్రితమే భార్య లక్ష్మీదేవి అనారోగ్యంతో మృతి చెందడంతో పండుగ వేళ ఆయన ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రతాప్‌రెడ్డి, మహేష్‌రెడ్డి అనే ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు.

చికిత్స పొందుతూ..


మృతి చెందిన వెంకటరాముడు

గడివేముల: పాముకాటుకు గురైన ఒండుట్ల గ్రామానికి చెందిన బుగ్గానిపల్లె వెంకటరాముడు (39) చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతిచెందారు.14వ తేదీన పొలం పనులకు వెళ్లిన మృతుడు మొక్కజొన్న పంటకు నీళ్లు పెడుతుండగా కాలుకు పాము కాటేసింది. గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల రైతులు వచ్చి వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు భార్య వెంకటసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

గుర్రాన్ని ఢీకొని వ్యక్తి మృతి


రామాంజనేయులు (ఫైల్)

ఆలూరు రూరల్: హులేబీడు గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన రామాంజినేయులు (24) భార్య, కుమార్తెతో బైక్‌పై ఆలూరు వస్తుండగా రహదారిపై ఉన్న గుర్రాన్ని ఢీకొన్నాడు. గాయపడిన దంపతులను 108లో ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామాంజినేయులు మృతి చెందగా, అతని భార్య ఉషను మెరుగైన చికిత్స నిమిత్తం బళ్లారికి తరలించారు. చిన్నారి మేఘన క్షేమంగా బయటపడింది. ఈ ప్రమాదంలో గుర్రం అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రి జయరాం సోదరుడు శ్రీనివాసులు, చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి సోమవారం మృతుడు రామాంజినేయులు కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయమందించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

వెల్దుర్తి: శ్రీరంగాపురంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ, బీజేపీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇటీవల గ్రామంలో కర్నూలు ప్రైవేట్ ఆసుపత్రి వారు నిర్వహించిన మెడికల్ క్యాంప్ విషయంలో మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసిందన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు కోటి యాదవ్, మరి కొందరిపై, మరో వర్గంలోని నాగిరెడ్డి, మరి కొందరిపై కేసులు నమోదు చేశామన్నారు.

హమాలీ దుర్మరణం


గౌసిద్ద (ఫైల్)

చిప్పగిరి:కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా మోకా గ్రామ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో డేగులహాల్ గ్రామానికి చెందిన హమాలీ గౌసిద్ద దుర్మరణం చెందాడు. మోకాలో నివాసముంటూ బళ్లారి హమాలీ పని చేస్తున్న ఇతను పని నిమిత్తం బైక్‌పై ఆదివారం తెల్లవారుజామున వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య అన్నపూర్ణ, కుమారుడు జగదీష్, కుమార్తె లావణ్య ఉన్నారు.

గుర్తు తెలియని యువతి మృతదేహం లభ్యం


రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని యువతి మృతదేహం

కర్నూలు: కర్నూలు రైల్వేస్టేషన్ శివారులోని ఆనంద్ థియేటర్ సమీపంలో రైలు ట్రాక్‌పై గుర్తు తెలియని యువతి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. యువతి 20 సంవత్సరాల వయస్సు ఉండి 5 అడుగుల ఎత్తు ఉంటుంది. బ్రౌన్ కలర్ స్వెటర్, గులాబీ కలర్‌పై నల్లటి చారలు గల పంజాబీ డ్రస్సు, గులాబీ కలర్ లెగ్గిన్ ధరించింది. కుడిచేతిపై లాస్య, అమ్మ సునీత అనే పచ్చబొట్లు ఉన్నాయి. కుడి చేతి మణికట్టుకు నల్లటి దారం ఉంది. రైలు కింద పడి యువతి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 94407 56043 (ఎస్‌ఐ), 94407 32143 (సీఐ) లను సంప్రదించాలని రైల్వే పోలీసులు సూచించారు.

భర్త వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న శారదమ్మ

జూపాడుబంగ్లా:భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది.నందికొట్కూరు పట్టణంలో ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎన్‌వీ రమణ వివరాల మేరకు... పట్టణంలోని సంగయ్యపేటకు చెందిన శారదమ్మ(35)కు కొత్తపల్లికి చెందిన ఆంజనేయులుతో వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. లారీడ్రైవర్‌గా పనిచేసే ఆంజనేయులు తాగుడుకు అలవాటు పడి భార్య, పిల్లల పోషణను విస్మరించాడు. దీంతో నిత్యం భార్యాభర్తలు తగాదా పడేవారు. భర్త ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో కొద్ది రోజుల క్రితం శారదమ్మ ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. శనివారం రాత్రి తప్పతాగిన భర్త ఆమె వద్దకు వెళ్లి మళ్లీ ఘర్షణపడ్డాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి లోనైన శారదమ్మ ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. తల్లి మృతితో ఇద్దరు పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించారు.